సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 7 । మార్చి । 2024

ముందస్తు మహిళా దినోత్సవం

సిరిసిల్లటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ, ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. మహిళలు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణాధ్యక్షురాలు వెల్ముల స్వరూప, మాజీ కౌన్సిలర్లు మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లోకి మరో కౌన్సిలర్



గూడూరి లక్ష్మికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: కాంగ్రెస్ పార్టీలోకి వేములవాడకు చెందిన మరో బీఆర్ఎస్ కౌన్సిలర్ గూడూరి లక్ష్మి, ఆమె భర్త గూడూరి మధు, మరో యాభై మంది పద్మశాలి సంఘం నాయకులు బుధవారం చేరారు. వీరికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. లక్ష్మి చేరికతో వేములవాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలం పెరిగింది. మరికొంత మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో సరైన గౌరవం లేదని, ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ ఆప్యాయత, ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు వైస్‌చైర్మన్ ఎన్నిక

వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అన్వేశ్ బుధవారం తెలిపారు.

వస్త్రపరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న గాజుల బాలయ్య

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిరిసిల్ల వస్త్రపరిశ్రమను ఆదుకునేలా బతుకమ్మ చీరలు, తదితర ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య కోరారు. సిరిసిల్లలోని సంఘం భవనంలో బుధవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఆర్డర్లు రాకుండా కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏటా ఫిబ్రవరిలోనే బతుకమ్మ చీరల ఆర్డర్లు వచ్చేవని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఆర్డర్లు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల వస్త్రపరిశ్రమను ఆదుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బకాయిలు విడుదల చేయాలని కోరారు. టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గుండ్లపెల్లి పూర్ణచందర్, దార్నం లక్ష్మీనారాయణ, గెంట్యాల శ్రీనివాస్, దూస వినయ్, దార్ల సందీప్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో సోమ రాజేశ్వర్

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్డీవో ఆఫీస్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో రాజేశ్వర్ బుధవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని ఓటర్లు, కొత్తగా నమోదైన వారి వివరాలు తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ మహేశ్‌కుమార్, డీటీ శ్రావణ్, నాయకులు పొలాస నరేందర్, నిత్యానందరావు, రాము, రామస్వామి ఉన్నారు.

ఆది శ్రీనివాస్ పీఎస్‌గా గోలి



గోలి శ్రీనివాస్

వేములవాడ: ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వం తరఫున పర్సనల్ సెక్రటరీగా రాజన్న ఆలయ పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గోదాం ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న గోలి శ్రీనివాస్ బుధవారం తన బాధ్యతలను ఆలయ అధికారులకు అప్పగించి, ఆది శ్రీనివాస్ పీఎస్‌గా జాయిన్ అయ్యారు.

10న రంగినేని ఎల్లమ్మ స్మారక పురస్కారం ప్రదానం



వంశీకృష్ణ

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల శివారులోని రంగినేని మోహన్‌రావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు తన తల్లి ఎల్లమ్మ స్మారకార్థం ఏటా ఇచ్చే పురస్కారాన్ని ఈనెల 10న ప్రదానం చేయనున్నట్లు పురస్కార కమిటీ సమన్వయకర్త మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. వంశీకృష్ణ వెలువరించిన 'రెప్పవాలని రాత్రి' కవితా సంపుటిని ఈ సంవత్సరం పురస్కారానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

- నేటి నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు షురూ..
- దారులన్నీ వేములవాడ వైపు
- తరలివస్తున్న భక్తజనం
- రూ.3కోట్లతో భారీ ఏర్పాట్లు

దర్శిద్దాం..తరిద్దాం

వేములవాడ : దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న సన్నిధిలో గురువారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ఆరంభంకానున్నాయి. ఈనెల 9 వరకు అంగరంగ వైభవంగా మహాశివరాత్రి జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాలకు దాదాపు రెండు లక్షల వరకు భక్తులు వస్తారని జిల్లా అధికారుల అంచనా. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు రూ.3 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేములవాడకు చేరుకునే ఐదు ప్రధాన రహదారుల్లో భక్తులకు స్వాగతం పలికేందుకు స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.



మహాజాతర పూజలు ఇవే..

వీఐపీ దర్శనం	: రూ.300
ప్రత్యేక దర్శనం	: రూ.50
కోడెమొక్కులు	: రూ.100
స్పెషల్ కోడెమొక్కులు	: రూ.200
శీఘ్రదర్శనం	: రూ.100

అత్యవసర ఫోన్ నంబర్లు

డీఎస్పీ నాగేంద్రచారి
87126 56412

ఈవో, కృష్ణప్రసాద్
94910 00743

స్థానిక వైద్యాధికారి, మహేశ్‌రావు
94400 78901

ఆర్టీసీ డీఎం, మురళీకృష్ణ
99592 25926

వేములవాడటౌన్, సీఐ కరుణాకర్
87126 56413

స్థల పురాణం

రాజన్న గుడికి సంబంధించి అనేక పురాతన గాథలున్నాయి. పూర్వం నారద మహాముని భూలోకంలో సంచరిస్తూ ప్రజలను కష్టాల నుంచి విముక్తి కల్పించాలని శివుడిని వేడుకోగా స్వామి కాశీలో ఉద్భవించినట్లు చెబుతుంటారు. అక్కడ సంతృప్తి చెందక వేములవాడకు చేరుకున్నాడని, శివుని వెంట భాస్కరుడు వచ్చాడని ప్రతీతి. అందుకే ఈ క్షేత్రాన్ని భాస్కర క్షేత్రంగా.. హరిహర క్షేత్రంగా పిలుస్తారు.

చారిత్రక విశిష్టత

క్రీస్తుశకం 750 నుంచి 973 వరకు చాళుక్యులు వేములవాడను రాజధానిగా చేసుకుని పరిపాలించారని చారిత్రక ఆధారాలున్నాయి. చాళుక్యులకు పూర్వమే శాతవాహనులు పరిపాలించినట్లు ఆధారాలు ఉన్నట్లు చెబుతుంటారు. శాతవాహనుల కాలం నాటికే వేములవాడలో జైనులు, బౌద్ధుల ఆచారాలు తెలిపే విగ్రహాలు అనేకం ఉన్నాయి.

కోడెమొక్కు.. కొంగుబంగారం

సంతానం లేని దంపతులు తమకు సంతానం కలిగితే కోడెమొక్కు చెల్లించుకుంటామని మొక్కుకుంటారు. పిల్లలు పుట్టగానే కోడెమొక్కు చెల్లించుకోవడం భక్తుల విశ్వాసం. పంటలు బాగుంటే కోడెను కట్టేస్తామని రైతులు మొక్కుకుంటారు. పంటలు సంవృద్ధిగా పండితే ఇంటి నుంచే కోడె(నిజ కోడె)ను తీసుకొచ్చి రాజన్న ఆలయంలో అప్పగిస్తుంటారు. ఆలయ ఆవరణలోనే మతసామరస్యానికి ప్రతీకగా దర్గా ఉంది. ఇక్కడి ఖాజాబఖ శ్వార్‌ను దర్శించుకుంటారు.

మహాశివరాత్రి ప్రత్యేక పూజలు

- 7వ తేదీ రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాజన్నకు పట్టు వస్త్రాల సమర్పణ.
- 7వ తేదీ రాత్రి 7.30 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అక్కడి అర్చకుల ప్రత్యేక బృందం రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.
- రాత్రి 9.30 గంటలకు నిషిపూజ అనంతరం సర్వదర్శనం.
- 8వ తేదీ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు శివస్వాములకు దర్శనం.
- సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అద్దాల మంటపంలో మహాలింగార్చన.
- రాత్రి 11.35 గంటల నుంచి వేకువజాము 3.30 గంటల వరకు లింగోద్భవ సమయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

తలనీలాలు.. ధర్మగుండం

మొట్టమొదట ఈ ధర్మగుండం మడుగుగా ఉండేది. పురాతన కాలంలో నరేంద్రమహారాజు కుష్టువ్యాధితో బాధపడుతూ ఈ క్షేత్రాన్ని సందర్శించి ధర్మగుండంలో స్నానం చేయడంతో వ్యాధి నయమైనట్లు స్థలపురాణం చెబుతుంది. దీర్ఘకాలిక చర్మ వ్యాధులతో బాధపడే వారు ధర్మగుండంలో స్నానాలు చేస్తే నయమవుతాయని భక్తుల విశ్వాసం. కల్యాణకట్టలో రూ.10 చెల్లించి టికెట్ తీసుకుని తలనీలాలు సమర్పించుకుంటుంటారు.

వేములవాడకు ఇలా చేరుకోండి

- హైదరాబాద్‌కు 150 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 32 కిలోమీటర్ల దూరంలో వేములవాడ ఉంది. రోడ్డు మార్గం ద్వారానే ఇక్కడికి చేరుకోవచ్చు.
- సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండు నుంచి ప్రతీ 30 నిమిషాలకో బస్సు, కరీంనగర్ నుంచి ప్రతీ పది నిమిషాలకో బస్సు సౌకర్యం ఉంది.
- హైదరాబాద్ నుంచి వయా సిద్దిపేట మీదుగా, వరంగల్ నుంచి వయా కరీంనగర్ మీదుగా వేములవాడకు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.
- వేములవాడ గుడి చెరువు కట్టకింద ప్రత్యేక బస్టాండు ఏర్పాటు చేశారు. దాదాపు 400 బస్సులతో 900 ట్రిప్పులను ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు.
- బస్టాండ్ నుంచి ఆలయానికి చేరుకునేందుకు ఉచితంగా 15 బస్సులు నడిపించనున్నారు.

ఉచిత భోజనం.. తాగునీటి సౌకర్యం

జాతర సందర్భంగా మూడు రోజులపాటు స్థానిక ట్రస్టుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో ఉచితంగా భోజన సౌకర్యం, పార్వతీపురంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు 6 లక్షల నీటి ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఆరు రాజన్న జలప్రసాదాల సెంటర్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు.

దర్శనీయ స్థలాలు

వేములవాడ పట్టణంలో భీమేశ్వరాలయం, బద్దిపోచమ్మ, నగరేశ్వరాలయం, కేదారీశ్వర, వేణుగోపాలస్వామి, నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి, అగ్రహారం జోడాంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి.

ప్రసాదాల కౌంటర్లు

ధర్మగుండం పక్కనే ఉన్న ప్రసాదాల కౌంటర్, దేవస్థానం దక్షిణ ద్వారం వద్ద, గతంలో ఆంధ్రా బ్యాంకు ఉన్న భవనంలో ప్రసాదాల కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. లడ్డు రూ.20, పులిహోరా ప్యాకెట్ రూ.15 చొప్పున అందజేస్తారు.

అత్యవసర సేవలు

- రాజన్న ఆలయం ఎదుట పోలీస్ కంట్రోల్‌రూమ్
- అమ్మవారి కాంప్లెక్స్‌లో తాత్కాలిక వైద్యశాల.
- పార్కింగ్ స్థలాలు, వసతి గదుల వద్ద నిరంతరం వైద్యసేవలు.
- వీటి పర్యవేక్షణకు ఒక స్పెషల్ ఆఫీసర్, 13 మంది నోడల్ ఆఫీసర్లను కలెక్టర్ అనురాగ్ జయంతి నియమించారు.
- మొబైల్ అంబులెన్స్, ఫైర్ సేవలు అందుబాటులో ఉంటాయి.
- 1600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలన

మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ గౌతమి బుధవారం పరిశీలించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ తదితరులు సౌకర్యాల కల్పనను పర్యవేక్షించారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



సిద్ధమవుతున్న శివార్చన వేదిక



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ గౌతమి

ఉపాధి కల్పించండి

- సిరిసిల్లలో కొనసాగిన ధర్నాలు, దీక్షలు

సిరిసిల్ల: వస్త్రపరిశ్రమలో పనిచేసే కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, సాంచాలు బంద్ పడడంతో పనిలేక కార్మికులు దిక్కులు చూస్తున్నారని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీవై నగర్‌లోని చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ఎదుట బుధశారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసాములు, కార్మికులు ధర్నా చేశారు. మూషం రమేశ్ మాట్లాడుతూ వస్త్రపరిశ్రమలో సంక్షోభం నెలకొందని, బతుకమ్మ చీరల ఆర్డర్లు లేక.. ప్రైవేటు మార్కెట్‌లో బట్టకు గిట్టుబాటు ధర రాక.. సాంచాలు బంద్ పడ్డాయన్నారు. ప్రభుత్వం చొరవ చూపి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే గతంలో మాదిరిగా నేతకార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఈ సంక్షోభాన్ని నివారించకుంటే నేత కార్మికులతో 'చలో హైదరాబాద్' చేపడతామని హెచ్చరించారు. పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పించేలా ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అందించారు. అన్నల్‌దాస్ గణేశ్, కూచన్ శంకర్, సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేశ్, బెజుగం సురేష్, గడ్డం రాజశేఖర్, మూషం శంకర్, అక్కల శ్రీనివాస్, ఆడెపు రవి, రవీందర్, రాజమౌళి, వెంకటేశం, రాజు, ప్రవీణ్, సత్యం, మహేశ్ పాల్గొన్నారు.



రెండో రోజు దీక్షలో ఆసాములు

కొనసాగుతున్న ఆసాముల దీక్షలు

సిరిసిల్లలోని జౌళిశాఖ ఆఫీస్ ఎదుట ఆసాములు దీక్షలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. ప్రభుత్వం స్పందించి బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని, వస్త్రపరిశ్రమకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరారు. రెండో రోజు దీక్షలో సిరిసిల్ల రవీందర్, మండల్ రాజు, వెల్దండి రాజేశం, సత్యనారాయణరెడ్డి, వంగ శేఖర్ కూర్చున్నారు.

ప్రశాంతంగా దర్శనాలు సాగాలి

- భక్తులతో మర్యాదగా మెదలుకోవాలి
- పోలీసు సిబ్బందికి ఎస్పీ అఖిల్ మహాజన్ సూచన
- మహాజాతరకు 1500 మంది సిబ్బందితో భద్రత

వేములవాడ: రాజన్న క్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి జాతర మహోత్సవాలకు వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామిని దర్శించుకునేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. భక్తులతో మర్యాదగా మెదులుకోవాలని సూచించారు. పట్టణంలోని మహారాజా ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జాతర విధుల నిర్వహణపై దిశ, నిర్దేశం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 1500 మందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బందోబస్తును 7 సెక్టార్లుగా విభజించి, మూడు షిఫ్టుల్లో విధులు కేటాయిస్తున్నామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు సలహాలు, సూచనలు ఇస్తూ తిరిగి క్షేమంగా వెళ్లేలా చూడాలని సూచించారు. భక్తులు క్యూలైన్‌లో వచ్చేలా చూడాలన్నారు. ప్రధానాలయంతోపాటు అనుబంధ భీమేశ్వర, నగరేశ్వర, కేదారేశ్వర, బద్దిపోచమ్మ, నాంపెల్లి, అగ్రహారం ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో మహిళల రక్షణకు షీటీమ్ బృందాలు విధుల్లో ఉంటాయన్నారు. అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. జాతరకు వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

జాతరకు భారీ భద్రత

సిరిసిల్లక్రైం: మహాశివరాత్రి ఉత్సవాలకు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం పోలీసు అధికారులతో సమీక్షించారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 1400 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు చేపడుతున్నట్లు తెలిపారు. జాతర ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. 8 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని, పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే భక్తుల వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందుకెళ్లాలన్నారు. ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, గంగాధర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ నాగేంద్రచారి, ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి

పంటను కాపాడుకునేందుకు..

సిరిసిల్ల: ఇతను తంగళ్లపల్లి మండలం రామన్నపల్లెకు చెందిన రైతు రాజయ్య. బావిలో నీరు అడుగంటిపోవడంతో మోటార్‌ను మరింత లోతుకు దించేందుకు పైపు అవసరం పడింది. దీంతో బుధవారం సిరిసిల్లకు వచ్చి పైపు కొనుగోలు చేశాడు. రామన్నపల్లెకు బస్సులు తక్కువగా ఉండడంతో ఆటోస్టాండ్ వరకు ఇలా పైపు తన భుజాలపై వేసుకొని మోసుకెళ్తున్నాడు. పంటను కాపాడుకునేందుకు మిట్ట మధ్యాహ్నం ఎండను సైతం లెక్క చేయకుండా ఈ రైతు పడుతున్న కష్టాన్ని చూస్తే.. పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు పడే అష్టకష్టాలు అర్థమవుతున్నాయి.





సాగునీటి కోసం అన్వేషణ

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎండలు మండుతున్నాయి. బావులు, బోరుల్లో నీరు అడుగంటుతోంది. వరి పంటకు నీరు చాలక అన్నదాత అష్టకష్టాలు పడుతున్నారు. చేతికందిన పంటను కాపాడుకునేందుకు రైతులు బావుల్లో పూడికతీత పనులు చేపట్టారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట, పొన్నాలపల్లె గ్రామాల్లో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. క్రేన్‌లు, మిషన్ల సాయంతో పూడిక తీయిస్తున్నారు.

క్లుప్తంగా

మాజీ ఎంపీటీసీ సభ్యుడికి రూ.5లక్షల జరిమానా

కరీంనగర్‌అర్బన్‌: పల్లె ప్రకృతి వనాలను తొలగించిన సిరిసేడు మాజీ ఎంపీటీసీ రేణికుంట చిన్నరాయుడుకు రూ.5లక్షల జరిమానా విధించారు. ఇల్లందకుంట మండలం బోగంపాడు, సిరిసేడు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను తొలగించిన విషయం తెలిసిందే. ఈమేరకు వాల్టా చట్ట ప్రకారం జిల్లా కలెక్టర్‌ రూ.5లక్షలు జరిమానా విధించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్‌ తెలిపారు.

రైలు కిందపడి ఒకరి మృతి



ముకుందరావు (ఫైల్‌)

జమ్మికుంట: మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన బిస్సాడి ముకుందరావు(58) రైలు కిందపడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని రైల్వేగేటు వద్ద రైలు కింద పడి మృతి చెందాడని, మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ గంగారపు తిరుపతి విచారణ చేస్తామని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గేట్‌లో బుధవారం మహారాష్ట్రకు చెందిన అక్షయ్‌ సదాశివ్‌ కుంబరే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. బ్రిక్‌ కంపెనీలో పనిచేస్తున్న అక్షయ్‌ సదాశివ్‌ కుంబరే మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అతని స్నేహితుడు మృతిచెందగా స్వగ్రామానికి వెళ్లి వచ్చి స్నేహితుడి మృతి తట్టుకోలేక మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి సదాశివ కుంబరే ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్‌ తెలిపారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం



శ్రీకాంత్‌ (ఫైల్‌)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం మలేషియా వెళ్లిన మండలంలోని కొలనూర్‌కు చెందిన సుదమల్ల శ్రీకాంత్‌(33) అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోగా.. మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. శ్రీకాంత్‌ గత జనవరి 22న పక్షవాతానికి గురికాగా.. సరైన వైద్యం అందలేదు. పక్షవాతంతో బాధపడుతున్న శ్రీకాంత్‌ను తీసుకొచ్చేందుకు కుటుంబీకులు మలేషియా వెళ్లినా తీసుకొచ్చేందుకు అక్కడి కంపెనీ అంగీకరించలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్వదేశానికి తిరిగొచ్చారు. కాగా ఫిబ్రవరి 22న శ్రీకాంత్‌ మృతిచెందాడు. మృతునికి భార్య లహరి, కూతురు ప్రణీత(3), కుమారుడు శ్రీహన్స్‌(18 నెలలు) ఉన్నారు.

11న విదేశీ ఉద్యోగ నియామకాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్‌: విదేశీ ఉద్యోగ నియామకాలపై ఈనెల 11న సికింద్రాబాద్‌ని గాంధీ మెడికల్‌ కాలేజీలో టామ్‌కాం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్‌ రిక్రూట్‌మెంట్‌ ఏజెన్సీ ద్వారా తెలంగాణ ఓవర్సీస్‌ మ్యాన్‌ పవర్‌ కంపెనీ లిమిటెడ్‌(టామ్‌కాం) అవగాహన కార్యక్రయం నిర్వహిస్తోందన్నారు. 21–38 ఏళ్ల వయస్సు, బీఎస్సీ అర్హత గల నర్సింగ్‌ గ్రాడ్యుయేట్లు, జీఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు నర్సింగ్‌ కేరీర్‌ అవకాశాల కోసం హాజరుకావాలని సూచించారు. జర్మన్‌ భాషపై నివాస శిక్షణ, జర్మనీలో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తినైపుణ్యాలను టామ్‌కాం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల నర్సింగ్‌ అభ్యర్థులు సెల్‌ నంబర్‌ 99088 30438, 63022 92450, 89190 47600, 79012 90580 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సంతోషం.. అంతలోనే విషాదం

- రెండు ఉద్యోగాలు సాధించిన భార్య
- విందు ఇవ్వాలని కోరిన స్నేహితులు
- ఇంటి నుంచి వెళ్లిన గంటకే రోడ్డు ప్రమాదం
- ముందునుంచి వేగంగా వచ్చి కబళించిన లారీ
- అక్కడికక్కడే దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు



ధర్మపురిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు



రాజశేఖర్‌ (ఫైల్‌)

ధర్మపురి: భార్య రెండు ఉద్యోగాలు సాధించడంతో స్నేహితులు పార్టీ అడిగారు. వారికి విందు ఇచ్చేందుకు వెళ్లిన గంటలోనే రోడ్డు ప్రమాదం కబళించింది. దీంతో ఆ ఇంట్లో విషాదం నిండింది. ఈ ఘటన ధర్మపురిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని గంగపుత్ర కాలనీకి చెందిన నర్మల రాజశేఖర్‌ (36) బీర్‌పూర్‌ మండల పరిషత్‌ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్‌ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. రాజశేఖర్‌ భార్య మనీషా ఇటీవల ప్రకటించిన టీజీటీ, పీజీటీలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. దీంతో పార్టీ (దావత్‌) ఇవ్వాలని తోటి మిత్రులు కోరారు. మంగళవారం సాయంత్రం బీర్‌పూర్‌లో విధులు ముగించుకుని ఇంటికి చేరిన రాజశేఖర్‌ నిద్రకు ఉపక్రమించాడు. అదే సమయంలో తన స్నేహితుడైన ధర్మపురికి చెందిన సిరుప బద్రి ఇంటి కొచ్చి పార్టీ కోసమని ద్విచక్రవాహనంపై మండలంలోని రాయపట్నం గ్రామానికి వెళ్లారు. విందు చేసుకుని తిరిగి వస్తుండగా బూరుగుపల్లె బస్టాండ్‌ వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజశేఖర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సిరుప బద్రి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

ఇంటి నుంచి వెళ్లిన గంటలోపే..

ఇప్పుడే వస్తానంటూ రాజశేఖర్‌ మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. వెళ్లిన కొద్దిసేపటికే పార్టీ ముగించుకుని తిరుగు పయనమయ్యారు. అంతలోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో భార్య, తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. రాజశేఖర్‌కు కుమారుడు శ్రీహర్ష ఒక్కగానొక్క కుమారుడు. అతడు తండ్రి చితికి నిప్పు పెట్టడం అక్కడున్న వారిని కలిచివేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్‌ తెలిపారు.

ఫ్రీగా ఎల్‌ఆర్‌ఎస్‌ అమలు చేయాలి



సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



వేములవాడలో బీఆర్‌ఎస్‌ నాయకుల ధర్నా

- టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరి రవీందర్‌రావు
- సిరిసిల్ల, వేములవాడల్లో బీఆర్‌ఎస్‌ శ్రేణుల ధర్నా
- ఆర్డీవోకు వినతిపత్రం

సిరిసిల్ల/వేములవాడ: ఎల్‌ఆర్‌ఎస్‌ పేరిట రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఫీజులు వసూలు చేయాలని చూస్తుందని టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరి రవీందర్‌రావు విమర్శించారు. సిరిసిల్ల, వేములవాడల్లో బుధవారం బీఆర్‌ఎస్‌ శ్రేణులు భారీ సంఖ్యలో చేరి ధర్నా చేపట్టారు. సిరిసిల్లలో కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉండగా ల్యాండ్‌ రెగ్యులరైజేషన్‌ స్కీమ్‌(ఎల్‌ఆర్‌ఎస్‌) కోసం దరఖాస్తులు స్వీకరించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25.44 లక్షల దరఖాస్తులు రాగా.. ఒక్కో దరఖాస్తుకు నామమాత్రంగా వెయ్యి రూపాయలు ఫీజు వసూలు చేశామన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌ నేతలు ఎల్‌ఆర్‌ఎస్‌ పేరిట ఫీజులు వసూలు చేయొద్దని కోరారని, ఇప్పుడు ఎందుకు ఫీజులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్‌ అమలు చేస్తామన్నారని గుర్తు చేశారు. ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలలో ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని కోరుతూ సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో వినతిపత్రం అందించారు.

వేములవాడలో..

వేములవాడలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా చల్మెడ 'జై కాంగ్రెస్‌..' అంటూ మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ×సెస్‌¤ చైర్మన్‌ చిక్కాల రామారావు, జెడ్పీ చైర్‌పర్సన్‌ న్యాలకొండ అరుణ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌లు జిందం కళ, రామతీర్థపు మాధవి, బీఆర్‌ఎస్‌ నాయకులు గూడూరి ప్రవీణ్‌, ఎంపీపీలు పిల్లి రేణుక, పడిగెల మానస, చంద్రయ్యగౌడ్‌, బండ మల్లేశంయాదవ్‌, బైరగోని లావణ్య, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, గజభీంకార్‌ రాజన్న, బొల్లి రామ్మోహన్‌, పూసపల్లి సరస్వతి, కుంబాల మల్లారెడ్డి, డాక్టర్‌ రాజారాం, కౌన్సిలర్లు దార్నం అరుణ, గడ్డం లత, గుండ్లపల్లి పూర్ణచందర్‌, సుంకపాక మనోజ్‌, బాబు, సెస్‌ డైరెక్టర్‌లు రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజు, పట్టణ కార్యదర్శి క్రాంతికుమార్‌, మండలాల అధ్యక్షులు గోస్కుల రవి, మల్యాల దేవయ్య, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్‌, మారం కుమార్‌, జోగిని శంకర్‌, సిరిగిరి రామచందర్‌, నరాల శేఖర్‌, శ్రీనివాసరావు, పార్టీ సీనియర్‌ నాయకుడు ఏనుగు మనోహర్‌ రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో గొర్ల కాపరి మృతి



కొమురయ్య(ఫైల్‌)



కొమురయ్య మృతదేహం

ఓదెల/జమ్మికుంట:: ఓదెల మండలం జీలకుంట గ్రామశివారులో అబాది జమ్మికుంటకు చెందిన కొమ్ము కొమురయ్య (60) గొర్ల కాపరి విద్యుత్‌ షాక్‌తో బుధవారం మృతి చెందాడు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ము కొమురయ్యతో పాటు మరో ముగ్గురు పదిరోజుల క్రితం గొర్లను మేత కోసం జీలకుంటకు తీసుకొచ్చారు. గొర్లు మేత మేస్తుండగా కొమురయ్య బహిర్భూమికి వెళ్లాడు. జీలకుంటకుచెందిన బంగారి కొమురయ్య తన పంటలను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు మొక్కజొన్న పంట చుట్టూ విద్యుత్‌ తీగ అమర్చాడు. బహిర్భూమికి వెళ్లిన కొమురయ్య పంటకు అమర్చిన విద్యుత్‌ వైర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు సురేశ్‌, కూతురు ఉంది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌ వైరు రైతుపై కేసు

జీలకుంట గ్రామశివారులో అడవి పందులు, జంతువుల బారి నుంచి పంటలు కాపాడేందుకు విద్యుత్‌ వైరు అమర్చిన రైతు బంగారి కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు

బోయినపల్లి(చొప్పదండి): అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఒకరిని కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ కోర్టు మేజిస్ట్రేట్‌ తీర్పు వెలువరించినట్లు ఎస్సై ఎల్‌.శ్రీకాంత్‌ బుధవారం తెలిపారు. 2017 అక్టోబర్‌ 4న రత్నంపేటలో పెంచలయ్య ఇంట్లోకి బిచ్చు అనే వ్యక్తి అక్రమంగా ప్రవేశించి కర్రతో కొట్టాడు. తలకు గాయమైందని పెంచలయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, బిచ్చును కోర్టులో హాజరుపరిచారు. బిచ్చుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై శ్రీకాంత్‌ వివరించారు.

కమిషనర్‌ కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ముందు జగిత్యాల మున్సిపల్‌ కమిషనర్‌ అనిల్‌బాబు కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.

బాధ్యతలు స్వీకరించిన రాజన్న ఉత్సవ కమిటీ



పాలకమండలి సభ్యులు

వేములవాడ: మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ సభ్యులుగా అనుమల్ల చంద్రం(జగిత్యాల), వడ్డేపల్లి వెంకటరమణ(హుస్నాబాద్‌), కె.రాజిరెడ్డి(సిరిసిల్ల), సి.విజయలక్ష్మి(మంథని), సాగరం వెంకటస్వామి(వేములవాడ), పాత సత్యలక్ష్మి(వేములవాడ), కూరగాయల కొమరయ్య(వేములవాడ), సంద్రగిరి శ్రీనివాస్‌(వేములవాడ), కనికరపు రాకేశ్‌(వేములవాడ), నాంపల్లి శ్రీనివాస్‌(నాంపల్లి), పులి రాంబాబు(వేములవాడ), తూము సంతోష్‌(వేములవాడ), వకుళాభరణం శ్రీనివాస్‌(నూకలమర్రి), పిల్లి కనకయ్య(రుద్రవరం), సంగ స్వామియాదవ్‌(శాత్రాజుపల్లి), జగన్మోహన్‌రెడ్డి(నిజామాబాద్‌), చేపూరి గంగయ్య(నిమ్మపల్లి), చింతపంటి రామస్వామి(నర్సింగాపూర్‌), కాయితి నాగరాజు(దుంపేట), తొట్ల అంజయ్య(పోతారం), ఏనుగు రమేశ్‌రెడ్డి(దమ్మన్నపేట), సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి(మన్నెగూడం), ధార్న మల్లేశం(రుద్రంగి)లు ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌, ఆలయ ఈవో కృష్ణప్రసాద్‌ సమక్షంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఫెస్టివల్‌ కమిటీ సభ్యులకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదం అందజేశారు. ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ ఫెస్టివల్‌ కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతూ.. భక్తుల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

మహాశివరాత్రి మహోత్సవానికి రండి





మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్‌



ఎంపీ బండి సంజయ్‌ను ఆహ్వానిస్తున్న అధికారులు

వేములవాడ: మహాశివరాత్రి వేడుకలకు రావాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వవిప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ ఆహ్వానించారు. జగిత్యాల జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కలిసి ఆహ్వానపత్రికలు అందించారు. కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌కు ఆహ్వానపత్రికను ఆలయ పర్యవేక్షకులు హరినాథ్‌ అందజేశారు.

ఆధునిక సాగు విధానాలు అనుసరించాలి

- రైతులు అధిక దిగుబడులు సాధించాలి
- వారంలో రెండు రోజులు శిక్షణ
- అదనపు కలెక్టర్‌ ఎన్‌.ఖీమ్యానాయక్‌



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ ఖీమ్యానాయక్‌

సిరిసిల్ల: రైతులు ఆధునిక సాగు విధానాలు అనుసరించి, అధిక దిగుబడులు సాధించాలని అదనపు కలెక్టర్‌ ఎన్‌.ఖీమ్యానాయక్‌ కోరారు. హైదరాబాద్‌ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రాష్ట్రంలోని 110 రైతువేదికల్లో రైతుశిక్షణను ప్రారంభించారు. సిరిసిల్ల శివారులోని చంద్రంపేట రైతువేదికలో అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ రైతులకు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో వ్యవసాయంలో వస్తున్న మార్పులు, ఆధునిక విధానాలు, అధిక దిగుబడులు సాధించే వంగడాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడేలా ప్రభుత్వం ఈ శిక్షణ కేంద్రాలను ప్రారంభించిందని తెలిపారు. నోడల్‌ అధికారి, జెడ్పీ సీఈవో ఉమారాణి, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్‌, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

హన్మాజిపేటలో..

వేములవాడ మండలం హన్మాజిపేట రైతు వేదికలోనూ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఎండీపీవో శ్రీనివాస్‌, మండల పశువైద్యాధికారి, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అమ్మా నాన్నకు ఏమైంది..?

- గుండెపోటుతో తండ్రి మృతి
- దిక్కులు చూస్తున్న పిల్లలు



అమాయకంగా చూస్తున్న చిన్నారులు



రవి (ఫైల్‌)

వెల్గటూర్‌ : 'అమ్మా.. నాన్నకు ఏమైంది..? నాన్నను ఎక్కడికి తీసుకెళ్తన్నారు.. ? మళ్లీ ఎప్పుడొస్తాడు..? అమ్మ ఎందుకు ఏడుస్తున్నావమ్మా..' అంటూ ఆ చిన్నారులిద్దరూ అమాయకంగా అడుగుతుంటే ఏమని చెప్పాలో తెలియక అక్కడున్న వారందరూ గుండెలవిసేలా రోదించారు. నాన్న దూరమై చిన్నారులు.. కట్టుకున్నవాడు దూరమై భార్య, వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు దూరమై గుండెలవిసేలా ఏడుస్తున్న ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మూగల రవి (35) ఉపాధి నిమిత్తం గల్ఫ్‌ వెళ్లి మూడు నెలల క్రితమే ఇంటికొచ్చాడు. ప్రస్తుతం స్థానికంగా కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. అప్పటి వరకూ అందరితో కలివిడిగా గ్రామంలో తిరిగిన రవి గుండెనొప్పి బారిన పడడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రవికి భార్య జ్యోతి (29), కూతుళ్లు శాన్వి (7), సమన్వి (4) ఉన్నారు. రవి తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. చివరి దశలో ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు దూరమై తల్లిదండ్రులు, తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో వారి రోదనలు మిన్నంటాయి. తండ్రికి ఏమైందో తెలియని ఆ చిన్నారులు అమాయకంగా చూస్తుండడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.

పేద కుటుంబానికి పెద్ద ఆపద

- గోడ కూలి ఇంటిపెద్ద అకాల మరణం
- తల్లికి మాటలు రావు.. చెవులు వినిపించవు
- దిక్కుతోచని స్థితిలో ఇద్దరు కూతుళ్లు
- దాతలు ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లీకూతురు

కాల్వశ్రీరాంపూర్‌: పొట్ట చేతపట్టుకొని వలస వచ్చిన పేద కుటుంబానికి పెద్ద ఆపద వచ్చింది. గోడ కూలి ఇంటి పెద్ద అకాల మరణంతో భార్య, ఇద్దరు కూతుళ్లు దిక్కులేనివారయ్యారు. తండ్రి మృతితో చెవిటి, మూగ అయిన తల్లికి తమ కష్టసుఖాలు ఎలా చెప్పుకునేది అంటూ.. ఇద్దరు ఆడపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

15ఏళ్ల క్రితం వలస వచ్చి..

మంచిర్యాల జిల్లా జైపూర్‌ మండలం కుందారం గ్రామానికి చెందిన నిమ్మ రవి(35) 15ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం తమ బంధువుల ద్వారా కాల్వశ్రీరాంపూర్‌ మండలం మీర్జంపేట గ్రామానికి వలస వచ్చాడు. అతడికి భార్య కోమల (చెవిటి, మూగ), ఇద్దరు ఆడపిల్లలు సాత్విక(ఇంటర్‌), శ్రావిత (9వతరగతి) ఉన్నారు. గుంట భూమి లేదు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. రవి వ్యవసాయ కూలీగా, ఐకేపీ వరిధాన్యం కొనుగోళ్ల సమయంలో హమాలీగా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. అందరికీ తలలో నాలుకలా ఉండే రవి గత నెల 28న స్వగ్రామం కుందారంలో మల్లన్న దేవుడి బోనాల కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు గోడకూలి మృత్యువాతపడ్డాడు. అనంతరం మృతదేహాన్ని బంధువులు మీర్జంపేటకు తీసుకొచ్చి గ్రామస్తుల సాయంతో అంత్యక్రియలు జరిపించారు. పెద్దకూతురు సాత్విక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని పుట్టెడు దుఃఖంతో కరీంనగర్‌లో ఇంటర్‌ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తోంది. చిన్న కూతురు శ్రావిత కస్తూరిబా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అన్నీ తానై చూసుకున్న ఇంటిపెద్ద అకాల మరణంతో తామెలా బతికేది, తమ చదువులెలా సాగేది అంటూ ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. తమ చదువుల కోసం దాతలు తోచిన సాయం అందించి ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది. ఇటీవల అదే గ్రామానికి చెందిన దంపతులు డాక్టర్‌ పచ్చిక శ్రీకాంత్‌రెడ్డి–డాక్టర్‌ ప్రశాంతి రూ.50వేలు ఆర్థికసాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాల్సిన వారు
బ్యాంక్‌ అకౌంట్‌ నంబర్‌
62279304181
నిమ్మ కోమల
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌ ఎస్‌బీహెచ్‌వై0020388

కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి

- సొసైటీ సీఈవో శోభారాణి



కేక్‌ కట్‌ చేస్తున్న శోభారాణి

ఎల్లారెడ్డిపేట: కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి లభిస్తుందని స్పందన సేవా సొసైటీ సీఈవో హనుమకొండ శోభారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని బుధవారం పరిశీలించి మాట్లాడారు. మహిళల ఆర్థిక అక్షరాస్యత కోసం శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మహిళలు ప్రదర్శించగా.. శోభారాణి పరిశీలించారు. మహిళల సృజనాత్మకతను అభినందించారు. ఇదే స్ఫూర్తితో జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శిక్షణ తీసుకుంటున్న మహిళలతో కలిసి కేక్‌ కట్‌ చేశారు. ఎంపీపీ రేణుక, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, ట్రెయినర్లు రేఖ, భవాని తదితరులు పాల్గొన్నారు.